క్లుప్తంగా

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం కల్యాణ వేదికపై ఆశీనులు చేసి కల్యాణోత్సవ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు పసుపు, కుంకుమ, స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, ఆరూరు రామూర్తి, లీలా మోహన్, లలిత, కుసుమ, రాజేంద్రబాబు, రాధిక, సురేష్, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌లో రూ.లక్ష సీజ్



చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్న నగదు

గుడిపాల: మండలంలోని తమిళనాడు సరిహద్దులో ఏర్పాటుచేసిన గొల్లమడుగు చెక్‌పోస్ట్‌లో గురువారం వాహనాల తనిఖీలో భాగంగా రశీదులు లేకుండా వెళ్తున్న రూ.లక్షను సీజ్ చేసినట్లు ఎస్ఎస్‌టీ టీమ్ లీడర్ గణపతి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఏఆర్ఎస్ఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్స్ శ్రీహరి, ఎబినేషన్, కానిస్టేబుల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చివరిరోజు 14 నామినేషన్లు

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా గురువారం ఒక్కరోజు 14 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి చిన్నయ్య తెలిపారు. అందులో జై మహాభారత్ పార్టీ తరఫున గోపాల్ 1, సమాజ్‌వాదీ ఆమూరు పురుషోత్తం 1, వైఎస్సార్‌సీపీ పద్మ 1, నేషనల్ కాంగ్రెస్ ఎం.ఎస్.బాబు1, సి.ప్రవీణ్‌కుమార్ 1, టీడీపీ కలికిరి మురళిమోహన్ 2, తామరకన్ను1, జై భీమారావ్ పార్టీ తరఫున శివకుమార్1, జై భారత్ పార్టీ ఇంద్రసేన1, భారత చైతన్య యువజన పార్టీ హరిప్రసాద్1, విడుదలై చిరుతాంగల్ కచ్చి పార్టీ సంతోష్1, జనసేన పార్టీ అరవింద్1, నవరంగ కాంగ్రెస్ వి.బాబు 1 నామినేషన్లు వేసినట్లు తెలిపారు. మొత్తం 32 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నామినేషన్లను స్థానిక ఆర్వో కార్యాలయంలో పరిశీలిస్తున్నట్లు ఆర్వో చిన్నయ్య తెలిపారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



వినాయకపురం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో నీటి సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ జె.అరుణ చెప్పారు. వినాయకపురం పరిధిలో గురువారం ఉదయం తాగునీటి సరఫరాను పరిశీలించారు. నీటి సమస్యపై స్థానికులతో మాట్లాడారు. రెండు బోర్లలో నీటి పరిమాణం తగ్గిపోవడంతో నీటికి ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు తెలపగా, కమిషనర్ ఈ విషయంపై అధికారులతో చర్చించారు. నీటి కొరత తలెత్తకుండా ప్రస్తుతం సరఫరా చేస్తున్న ట్రిప్పులకు అదనంగా ట్రిప్పులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం స్థానికంగా పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మేజర్ మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించాలని ఆదేశించారు. అక్కడే ఉన్న వినాయకపురం ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేర అన్ని సౌకర్యాలు ఉన్నాయా, ఎన్నికలకు సంబంధించిన అధికారుల ఫోన్ నంబర్ల నమోదు వివరాలను తనిఖీ చేశారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, డీఈ వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, ఏఈ లోకేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం పత్రపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 37 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.104 మొబైల్ క్లినిక్‌లో గర్భిణులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

గుడిపాల: వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో పార్టీ శ్రేణులు



చిత్తూరు: ఇంటింటా ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి



బీవీరెడ్డికాలనీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఇందుమతి



ఫ్యాను గుర్తుకు ఓటేస్తే ముంగిట్లో సంక్షేమం

- పింఛన్లను పీకేస్తామంటే బెదరొద్దు..
- రానున్నది... జగనన్న ప్రభుత్వమే
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



గుడిపాల: ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముంగిట్లోకి రావాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేసి మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు మండలం అనగల్లు పంచాయతీలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలను అందించి ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తర్వాత ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు.ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత, మహిళల పక్షపాతి అన్నారు. వారి అభ్యున్నతే ధ్యేయంగా సీఎం పనిచేశారని చెప్పారు. చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపన్నారు. నాలుగేళ్ల కిత్రం ఎస్సీలను చులకన చేసి మాట్లాడి బాబు అభాసుపాలయ్యారని గుర్తుచేశారు. అటువంటి వ్యక్తికి ఓట్లేస్తే రాష్ట్రంలో రాక్షస పాలనను చూడాల్సి ఉంటుందన్నారు. తప్పుడు భజనలతో టీడీపీ ప్రజలను నమ్మించేలా చూస్తోందన్నారు. బాబు మాయలో పడితే మోసపోక తప్పదన్నారు. అధికారంలోకి రాకముందే తమ్ముళ్లు పింఛన్లను పీకేస్తామంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. వీటి బెదిరింపులకు భయపడవద్దని, కచ్చితంగా మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తోందని చెప్పారు. ఇందుకు ఓటర్లందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేస్తే సంక్షేమ పథకాలు ఇంటికే వస్తాయని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తోందనే విషయాన్ని మరో రెండు రోజుల్లో మేనిఫెస్టో ద్వారా చూడొచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబు నాయుడు, మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు అమరనాథ్‌రెడ్డి, సంపత్, సుబ్రమణ్యం, బాబు, రజనీ, మనోహర్, చరణ్, నరసింహులునాయుడు, జయరాం, సోమశేఖర్‌నాయుడు, వేలుస్వామి, దిలీప్, పరంధామయ్యనాయుడు, పాండి, స్టాండ్లీ, జయపాల్, వెంకటేష్, పట్టాభి, భాస్కర్, జయచంద్ర, రాజా, రవినాయుడు, దేవేంద్రరెడ్డి, మనవాలన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

గుడిపాల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమం అభివృద్ధి పట్టాలెక్కాయని, ఇది కొనసాగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. వసంతాపురం పంచాయతీలో గురువారం సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ఇంటింటా నిర్వహించారు. మహిళలు ప్రతి గడప వద్ద ఆయనకు హారతులు పట్టారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ ఇవ్వని సంక్షేమం అభివృద్ధిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. ఎన్నికల హామీలను 99 శాతం అమలుచేసి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్ని జెండాలు జతకట్టినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. గ్రామాల్లో తిరుగుతుంటే ఆడపడచులు అందరూ జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సర్పంచులు రజనీకాంత్, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు శిలంబరసన్, సాయిక్రిష్ణ, రెడ్డెప్ప, దిలీప్, వెంకటేష్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్, రమణ, గుండుసాయితోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో విస్తృతంగా ప్రచారం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారు. బీవీరెడ్డి కాలనీలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి ఇందుమతి ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులు వాడవాడలా తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ఐదేళ్లలో జరిగిన మేలును తిరిగి పొందాలంటే జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. బాలాజీకాలనీలో కార్పొరేటర్ చల్లముత్తు, చవటపల్లెలో టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ సహదేవన్, కొంగారెడ్డిపల్లెలో నాయకులు సురేష్, దేవరాజులనాయుడు, చంద్రశేఖర్ ఆచ్చారి, పీఎస్ మురళి, కిషోర్, రంగాచ్చారవీధి డివిజన్‌లో నాయకులు సైఫ్, వెంకటేష్, నవాజ్, గఫార్, గౌస్, తదితర డివిజన్లలో ప్రచారం చేశారు.









చవటపల్లెలో ప్రచారం చేస్తున్న టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ సహదేవన్, బాలాజీకాలనీలో కార్పొరేటర్ చల్లముత్తు ప్రచారం, కొంగారెడ్డిపల్లెలో నాయకుల ప్రచారం, రంగాచారివీధి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్


చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాకు విచ్చేసిన అబ్జర్వర్‌లకు గురువారం ఎన్నికల కసరత్తును వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు 1771 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. వీటిల్లో 425 సమస్యాత్మక, అతిసమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. ఆ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్, వీడియో కవరేజీ, సూక్ష్మపరిశీలకులను నియమించినట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో 24 గంటలపాటు అన్ని బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. అనంతరం వివిధ రకాల ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అబ్జర్వర్‌లకు వివరించారు.

నేరుగా, ఫోన్‌లో సంప్రదించవచ్చు

ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలు, ఫిర్యాదులున్నట్‌లైతే నేరుగా, ఫోన్ ద్వారా తమను సంప్రదించవచ్చని అబ్జర్వర్లు వెల్లడించారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నేరుగా తమను సంప్రదించి అర్జీలు ఇవ్వవచ్చన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని, అందులో ఎలాంటి సందేహాలకు తావులేదని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలోనే ఉంటామని అబ్జర్వర్‌లు తెలిపారు. ఈ సమావేశంలో అబ్జర్వర్‌లు ఎం.డి షాధిక్, పోలీసు అబ్జర్వర్ అమిత్ రాజ్, కైలాశ్ వాంఖడే, ఎస్పీ మణికంఠ, డీఆర్ఓ పుల్లయ్య, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్, గంగరాజు, పరదేశి, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

పోలింగ్‌పై విస్తృతంగా అవగాహన





గ్యాస్ సిలిండర్లకు అతికిస్తున్న స్వీప్ స్టిక్కర్లు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనే చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. 'గుర్తుంచుకోండి.. మే 13 పోలింగ్ తేదీ, అధికారం మీ చేతుల్లో..' అంటూ పోలింగ్ తేదీని గుర్తుచేస్తూ స్టిక్కర్ల ద్వారా గురువారం ప్రచారం చేశారు. స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కార్పొరేషన్ స్వీప్ నోడల్ బృందం ఓటు హక్కు ప్రాధాన్యత, పోలింగ్ తేదీలపై అవగాహన కోసం ప్రత్యేకంగా స్టిక్కర్లు రూపొందించారు. ఈ స్టిక్కర్లను ప్రజలకు చేరేలా గ్యాస్ సిలిండర్లపై అతికించి సరఫరా చేస్తున్నారు. జనం ఎక్కువగా గుమికూడే దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లోనూ ఈ స్టిక్కర్లను ప్రజలకు తెలిసేలా అతికిస్తున్నారు. ఆటోలకు అతికించి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ అధికారి చిన్నయ్య, స్వీప్ నోడల్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

నూతన కోర్టు భవనాల ప్రారంభం రేపు



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన జిల్లా న్యాయస్థానాల భవన సముదాయం శనివారం ప్రారంభం కానుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో పాటు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఇతర న్యాయమూర్తులు ఈ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. ఇందుకోసం న్యాయస్థానాల సముదాయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

వన్నెకుల క్షత్రియుల ప్రచారం



తోటపాళ్యం వద్ద కాశీనాయకర్, కణ్ణన్ తదితరుల ప్రచారం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో అత్యధిక ఓటర్లు ఉన్న సామాజిక వర్గాల్లో వన్నె కుల క్షత్రియులు (నాయకర్లు) కూడా ఉన్నారు. ఇప్పటికే ఆ సామాజికవర్గ కురువృద్ధులు కాశీనాయకర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బహిరంగ మద్దతు ప్రకటించారు. అంతటితో ఆగక, నాయకర్లు ఎక్కువగా ఉన్న గాంధీరోడ్డు, వన్నియర్‌బ్లాక్, తోటపాళ్యం తదితర ప్రాంతాల్లో కాశీనాయకర్‌తో పాటు పలువురు నాయకర్లు ఇంటింటా ప్రచారం చేస్తూ వైఎస్సార్‌సీపీని గెలిపించి, వైఎస్ జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రి చేయాలని ప్రజల్ని అభ్యర్థిస్తున్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చలవతోనే కుప్పంలో భరత్, తిరుపతిలో సిపాయి సుబ్రమణ్యంకు ఎమ్మెల్సీ ఇచ్చారని, ఇది తమ సామాజికవర్గానికి దక్కిన గుర్తింపన్నారు. చిత్తూరులో తమ సంఘ అభివృద్ధికి ప్రభుత్వం రెండు ఎకరాల భూమిని కేటాయించిందని గుర్తు చేస్తున్నారు. కాశీనాయకర్ వెంట తిరుమల బేకరి కణ్ణన్, కెప్టెన్ శివ, కార్పొరేటర్ గణేష్ మేస్త్రీ తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు.

చిత్తూరులో రూ.8.67 లక్షల నగదు స్వాధీనం



సీజ్ చేసిన నగదు చూపుతున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళుతున్న రూ.8,67,520 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని గాంధీరోడ్డులో గురువారం టూటౌన్ సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రసాద్ తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. గంగాధరనెల్లూరుకు చెందిన ప్రేమ్‌కుమార్, తన ద్విచక్రవాహనంలో ఓ బ్యాగులో నగదు తీసుకెళుతున్నాడు. దీన్ని గుర్తించిన పోలీసులు, బిల్లులు అడిగితే అతడి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

దశ తిరిగిన ప్రగతి

- మాట ప్రకారం ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం
- దేశంలో ఎక్కడా చేయని విధంగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు
- చిత్తూరు జిల్లాలో 2021 కుటుంబాల్లో వెలుగు
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన వైనం



చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆర్టీసీ ప్రగతి చక్రం వైపు ఈ ప్రభుత్వం అడుగులు వేసింది. డీజిల్ అదాతోపాటు ప్రమాదాల నివారణకు పట్టుబట్టింది. నష్టాలను అధిగమించడంతోపాటు కార్మికుల భవిష్యత్‌పై దృష్టి సారించింది. చరిత్రత్మాక నిర్ణయాలు తీసుకుంది. మాటకు కట్టుబడి ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. తద్వారా ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత లభించింది. వారి కుటుంబాల్లో చిరునవ్వులు పూయించింది.

ఆర్టీసీ విలీనానికి ఇలా నాంది

జిల్లాలోని సదుం వద్ద జరిగిన పాదయాత్రలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన విషయాన్ని ఆర్టీసీ యూనియన్ల నాయకులు, కార్మికులు జననేత వద్దకు తీసుకెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేశారని, జీతాలు సక్రమంగా అందించడం లేదని, ఒక వేళ సమ్మె చేస్తే జీతాల్లో కోతలు విధిస్తున్నారని, మెమోలు ఇవ్వడం, పనిభారం పెంచడం వంటి చర్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. ఈ పరిస్థితిని విన్న నాయకుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు మాట తప్పని ఈ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయింది.

ఆరునెలల్లోపే

ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఆర్టీసీ సంస్థను దేశంలో ఏ రాష్ట్రంలో చేయని సాహసాన్ని చేసింది. కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతోపాటు జీతభత్యాలను కూడా ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అందిస్తోంది. ఒకవైపు ఆర్టీసీ సంస్థ నష్టాల్లో ఉన్నా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ఆర్టీసీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలను అందిస్తోంది.

ఉద్యోగ భద్రత

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఈ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగులు, కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు రావడంతోపాటు వారికి ఉద్యోగ భద్రత కూడా కల్పించింది. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ప్రభుత్వంలోకి విలీనం చేసి నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఎన్నికలకు ముందు వచ్చిన హామీని ఆచరణలోకి పెట్టేందుకు ఈ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత మూడు నెలల్లో కమిటీ వేయడం, 2020 జనవరి 1 నుంచి అమలులోకి తీసుకురావడంతో కార్మికులందరూ ప్రజా రవాణా శాఖ ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. దశాబ్దాల తరబడి ఎవరూ చేయని సాహసవంతమైన నిర్ణయాన్ని ఈ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. దీంతో 2021 మంది కుటుంబాల్లో వెలుగులు నింపాయి.

సమ్మె చేస్తే జీతాలు కట్

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు చాలక అనేక ఇబ్బందులు పడేవారు. చంద్రబాబు హయాంలో సమ్మెలు, పోరాటాలు చేయడంతో పాటు తగిన ఫలితం దక్కలేదు. అయితే గత ప్రభుత్వం కార్మికులను వేధించి సమ్మె కాలానికి జీతాలను కట్ చేసి ఉక్కుపాదం మోపేవారు. ఉద్యోగ భద్రత కరువై కార్మికులు రోజులు లెక్క బెట్టుకునేవారు. అయితే ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించిందని పలువురు ఉద్యోగులు తెలిపారు.

కరోనాలోనూ జీతాల్లో కోతల్లేవు

కరోనా సమయంలో జిల్లాలోని ఐదు డిపోల్లో బస్సులన్నీ రోడ్డుపైకి రాక డిపోలకే పరిమితం అయ్యాయి. ఆ పరిస్థితుల్లో గత ప్రభుత్వమైతే కార్మికుల వేతనాల్లో కోతలు విధించేది. అయితే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఎన్ని కష్టాలు ఉన్నా ఒకటో తేదీన ఠంచన్‌గా జీతాలు చెల్లించింది. ఇలా జీతాలు చెల్లించడం దేశ చరిత్రలో మొదటిసారి అని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

డిపోలవారీగా ఉద్యోగుల వివరాలు

డిపోపేరు	సంఖ్య
చిత్తూరు-1	422
చిత్తూరు-2	522
పలమనేరు	327
కుప్పం	360
పుంగనూరు	348
డీపీటీఓ కార్యాలయంలో	42

టీడీపీ నేతల వేధింపులతో వలంటీర్ల రాజీనామా

ఐరాల: మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలోని 50 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఇందుకు సంబంధించి రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. రాజీనామా చేసిన వలంటీర్లు మాట్లాడుతూ కూటమి నేతల విమర్శలకు మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై సంక్షేమ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నారు.

బంగారుపాళెం మండలంలో..

బంగారుపాళెం: తిమ్మోజుపల్లె, సంక్రాంతిపల్లె, కాటప్పగారిపల్లె పంచాయతీలలో గురువారం పలువురు గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఎన్నికల కోడ్ పేరుతో టీడీపీ, జనసేన పార్టీలు ప్రజాసేవకు దూరం చేయడంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు.



ఐరాల: రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు